నమస్తే తెలంగాణ

# వరంగల్

10 | వరంగల్, ఆదివారం 8 జూన్ 2025 | WARANGAL




మేడిగడ్డ బరాజ్ వద్ద కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

## ఈతకు వెళ్లి ఆరుగురి గల్లంతు

- మేడిగడ్డ బరాజ్‌లో ఘటన
- అంతా 20 ఏళ్ల లోపు వారే
- గాలిస్తున్న పోలీస్, సింగరేణి రెస్క్యూ బృందాలు
- అంబట్‌పల్లి, కొర్లకుంటలో విషాదఛాయలు
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబసభ్యులు

మహదేవపూర్, జూన్ 7 : ఈతకు వెళ్లి శనివారం మేడిగడ్డ బరాజ్‌లో ఆరుగురు గల్లంతయ్యారు. ఎనిమిది మంది స్నేహితులు కలిసి వెళ్లగా ఇద్దరు పట్టి శివమణి, పట్టి వెంకటస్వామి ప్రాణాలతో బయటపడగా.. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన పత్తి మధుసూదన్(18), పట్టి శివమనోజ్(15), తొగరి రక్షిత్(13), కర్నాల సాగర్(16) మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన పండు(18), రాహుల్(19) ఆచూకీ దొరకలేదు. కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై పవన్‌కుమార్ అక్కడికి చేరుకొని సింగరేణి రెస్క్యూ, గజ ఈతగాళ్ల సాయంతో గాలించినా ఫలితం లేకపోయింది. గల్లంతైన వారంతా 20 ఏళ్ల లోపు యువకులే. కాగా తమ పిల్లల ఆచూకీ దొరకకపోవడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ చేరుకొని సహాయక చర్యలపై ఆరా తీశారు.

### గోదావరిలో ఈత కొట్టడం, 'ఫొటోలు, వీడియోలు' నిషేధం


భూపాలపల్లి ఇన్‌చార్జి కలెక్టర్ టీఎస్ దివాకర

భూపాలపల్లి రూరల్ : గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఈత కొట్టడం, ఫొటోలు, వీడియోలు తీయడంపై నిషేధం విధించినట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ టీఎస్ దివాకర తెలిపారు. శనివారం గోదావరి నదిలో ఈత కొట్టేందుకు వెళ్లి ఆరుగురు విద్యార్థులు గల్లంతైన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. గోదావరి నదిలో ఈత కొట్టడం, ఫొటోలు దిగడం, సోషల్ మీడియా కోసం వీడియోలు తీయడం, రీల్స్ చేస్తూ ప్రమాదాలు బారిన పడుతున్నందున వాటిని నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు.

వర్షాకాలం సమీపిస్తున్నది.. అదునుకు వానలు పడుతుండడంతో విత్తనం వేసేందుకు రైతులు దుక్కులు, వరినారు పోసేందుకు మడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇదంతా బాగానే ఉన్నా పంటల సాగు, విత్తన ఎంపిక విషయంలో రైతులకు వ్యవసాయ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి సూచనలు, సలహాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. దీంతో అన్నదాతలు అదనుకు దొరికే నకిలీ బీటీ విత్తనాలు, నాణ్యతలేని సీడ్‌ను వాడి మోసపోతున్నారు. పంట వేశాక పూతాకాత లేక రైతులు నష్టపోతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా నకిలీ విత్తనాలు వస్తున్నా పట్టించుకునే వారు లేరు. కొందరు కేటుగాళ్లు కలుపు మందు వాడినా పత్తి మొక్క చనిపోదని బీటీ-3 పేరుతో గ్రామాలు, తండాల్లో రైతులకు మాయమాటలు చెప్పి అంటగడుతున్నారు. వివిధ కంపెనీల విత్తనం కంటే తమ విత్తనమే నాణ్యమైనదని, తక్కువ రేటుకు ఇస్తామని రైతులను నమ్మించి మోసం చేస్తున్నారు. ఏటా అధికారులు నకిలీ విత్తనాలు విక్రయించేవారిపై ఉక్కుపాదం మోపుతున్నా ఈ దందాకు మాత్రం చెక్ పడడంలేదు.

- సుబేదారి/నర్సింహులపేట, జూన్ 7


- పత్తాలేని టాస్క్‌ఫోర్స్
- బీటీ-3 పత్తి విత్తనాలపైనే రైతుల ఆసక్తి
- పూత కాతలేక నష్టపోతున్న రైతులు
- అవగాహన కల్పించని వ్యవసాయ అధికారులు



# నకిలీ విత్తనాలపై నజర్ ఏది?

### బీటీ-3పై పెరిగిన రైతుల ఆసక్తి..

అధిక దిగుబడి, చీడ పీడలు తట్టుకునే రకం అనే సమ్మకంతో రైతులు బీటీ-3 పత్తి వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇదే కాకుండా కలుపునివారణ లేకుండా దిగుబడి వచ్చే అవకాశం ఉందని మొగ్గుచూపుతున్నారు. ఈ విత్తనాలను ప్రభుత్వం నిషేధించడంతో డిమాండ్ పెరిగింది. కొంత మంది వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ తమకు పరిచయం ఉన్న రైతులను కలుస్తూ, వారి ద్వారా ఈ విత్తనాలు రైతులకు అంటగడుతున్నారు. బీటీ విత్తనం రూ.వెయ్యి నుంచి రూ.1200ల వరకు అమ్ముతున్నారు. ఇప్పటికే కొంతమంది రైతుల వద్దకు బీటీ -3 విత్తనాలు చేరినట్లు తెలుస్తున్నది. అయితే, ఇప్పటికే రైతులు దుక్కులు సిద్ధం చేసుకొని.. అచ్చు తోలి చేన్లను సిద్ధం చేసుకున్నా, అధికారులు మాత్రం నకిలీ విత్తనాలపై రైతులకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. అధికారులు మాత్రం లైసెన్స్ ఉన్న విత్తన షాపుల్లో మాత్రమే తనిఖీలు నిర్వహిస్తున్నారు తప్పా.. గ్రామాల్లో పత్తి విత్తనాలు అమ్మే వారిపై కన్నెత్తి కూడా చూడకపోవడంతో అక్రమ వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై ఏవో వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో బీటీ -3 విత్తనాలు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. నకిలీ విత్తనం అమ్మే వారి సమాచారం పోలీసులకు కానీ, ఏఈవోలకు అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



పత్తి గింజలు నాటుతున్న కూలీలు

నకిలీలపై ఉక్కుపాదం మోపి నిందితులపై పీడీయాక్టులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంతో పాత నేరస్తులు మళ్లీ రెచ్చిపోతున్నారు. సీజన్ మొదలుకాగానే అమాయక రైతులను లక్ష్యంగా చేసుకొని యథేచ్ఛగా దందా చేస్తున్నారు. అయితే వరంగల్ పోలీస్ కమిషనరేట్ సహా పలు చోట్ల తరచూ నకిలీ విత్తనాలు, పురుగుల మందు విక్రయ ముఠాలు పట్టుబడుతున్న విషయం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. కొద్దిరోజుల క్రితం హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖపై చర్చ సందర్భంగా మంత్రి.. నకిలీల అంశాన్ని ప్రస్తావించారు. నిందితులపై ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నారు? పీడీయాక్ట్ ఎందుకు పెట్టడం లేదు? అని ప్రశ్నించారు. రైతులను మోసం చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని సమావేశానికి హాజరైన పోలీసు, వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అయితే మంత్రి చెప్పిన కొద్దిరోజులకే శుక్రవారం రెండు ముఠాలను కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలు, పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు ముఠాల్లో కూడా పాత కేసుల్లోని నిందితులున్నారు. తరచూ పట్టుబడే ఇలాంటి ముఠాల పట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే నిందితులు కొద్ది రోజులు జైలు శిక్ష అనుభవించి, బయటి వచ్చి మళ్లీ రైతులను మోసం చేస్తున్నట్లు తెలుస్తున్నది. స్వయంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశించినా పీడీయాక్ట్ వంటి కఠిన చట్టాలు అమలు కాకపోవడంతో నకిలీలు రెచ్చిపోతున్నాయి. ఇదిలాగే కొనసాగితే ఈ సీజన్‌లో బ్రాండెడ్ కంపెనీల పేర్లతో రైతులను నమ్మించి మోసం చేసేందుకు మరికొన్ని నకిలీ ముఠాలు పుట్టుకొచ్చే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా నకిలీలపై ఉక్కుపాదం మోపాలని రైతులు కోరుతున్నారు.

### మంత్రి ఆదేశించినా పీడీ యాక్టులు పెట్టరా?

- కఠిన చర్యల్లేక మళ్లీ పట్టుబడుతున్న పాత నేరస్తులు
- కేసుల నమోదులో ఉదాసీనంగా పోలీసుల తీరు

### అప్పుడూ ఇప్పుడూ వాళ్లే..!

యాసంగి సీజన్‌లో మార్చి 22న వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా రూ.78 లక్షల 63వేలు విలువైన నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలకు పాల్పడిన ఏడుగురి ముఠాను పట్టుకున్నారు. వాటి తయారీకి ఉపయోగించిన మిషనరీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో వరంగల్, పెద్దపల్లి, ములుగు, కరీంనగర్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తులు ఉన్నారు. అలాగే వానకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో మరో రెండు ముఠాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, పరకాల, గీసుగొండ పోలీసులు శుక్రవారం సంయుక్తంగా పట్టుకొని రూ.63 లక్షల విలువ చేసే నకిలీ విత్తనాలు, పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ దందా వ్యవహారాల్లో మార్చి నెలలో పట్టుబడిన నిందితులు, రెండు రోజుల క్రితం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో సీపీ అరెస్ట్ చూపిన నిందితుల్లో కూడా కొందరు పాత నేరస్తులు ఉన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, పక్కన ఎమ్మెల్సీ రమణ, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది, చల్లా, గండ్ర, బీఆర్ఎస్ భూపాలపల్లి అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

## కేసీఆర్ విజన్‌తోనే తెలంగాణ నంబర్ వన్

వాటా సభలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, జూన్ 7 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాకారానికి కేసీఆర్ ఎంత చిత్తశుద్ధితో కృషి చేశారో, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక అదే విజన్‌తో తెలంగాణను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారని ఆ రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దిన ఘనత ఎన్నటికీ ఆయనకే దక్కుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కొనియాడారు. అమెరికాలోని వాషింగ్టన్‌లో వాషింగ్టన్ తెలుగు అసోసియేషన్ (వాటా) ఏర్పాటు చేసి సభలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలుచేయలేదన్నారు. అదే కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎన్నికల్లో ఇవ్వని అనేక హామీలను కూడా అమలు చేసి ప్రజల మనసు చూరగొన్నారని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్టు, దళితబంధు, కాళేశ్వరం ప్రాజెక్ట్ రూపకల్పన, సాగునీటి వసతులు, వ్యవసాయానికి 24గంటల కరెంటు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, డబుల్ బెడ్‌రూంలు, వృద్ధాప్య పింఛన్లు ఇలా ఇవన్నీ సాధారణ కుటుంబాలను, రైతులను ఆర్థికంగా ఆదుకునే పథకాలని వివరించారు. రెండేళ్లలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. ఇక డాలస్‌లో తెలంగాణ ఎన్నారైలు నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ, ఆవర్భావ సభ అనూహ్య విజయం సాధించిందన్నారు. మరో రెండున్నరేళ్లలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఈమేరకు ఎన్నారైలు కృషిచేయాలని కోరారు. ఇక అమెరికాలో ట్రంప్ పాలసీతో మన విద్యార్థులు కొందరు అవస్థలు పడుతున్నారని, వారికి సహకారం అందించాలని వాటా సభ్యులు వంశీరెడ్డి, రాజేశ్, సందీప్, భూషణం, గణేశ్ వీరమనేని, మాణిక్యం బృందాన్ని ఎర్రబెల్లి కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్ల ధర్మారెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ఉన్నారు.

## 'ఇందిరమ్మ ఇండ్ల'లో మాదిగలకు మొండిచేయి

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్ మాదిగ



మాట్లాడుతున్న సురేశ్ మాదిగ

మంగపేట, జూన్ 7 : ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ములుగు జిల్లా మంగపేట గ్రామపంచాయతీ పరిధిలోని గోదావరి ముంపు ప్రాంతంలో గుడిసెల్లో ఉంటున్న మాదిగలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపిందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల సురేశ్ మాదిగ అన్నారు. శనివారం ఆయన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగపేట పంచాయతీ పరిధిలో మొత్తం 39 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, వాటిలో మాదిగలకు ఒక్క ఇల్లు కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి బంధువులు, డబ్బున్న వారికే మంజూరు చేశారన్నారు. ఇక్కడ నివసిస్తున్న మాదిగల సంఖ్య ప్రకారం ఎనిమిది ఇండ్లు రావాల్సి ఉన్నదని, వారికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. సమావేశంలో లంజపెల్లి పున్నారావు, సారయ్య, ఆదినారాయణ, బాబు, వెంకటేశ్, కృష్ణ, సంధ్య, రాములమ్మ, వీరమ్మ, వసంత, పూస ఎల్లమ్మ పాల్గొన్నారు.

- వైద్య విధాన పరిషత్ నుంచి బదిలీ
- జనరల్ ఆస్పత్రిగా పెరిగిన స్థాయి
- కొనసాగుతున్న ఉద్యోగులు, సిబ్బంది బదలాయింపు
- మెడికల్ కాలేజీ విద్యార్థులకు ఇక మెరుగైన విద్యా బోధన
- హాస్పిటల్‌లో తగినంత సిబ్బంది లేక అరకొరగా వైద్య సేవలు

## డీఎంఈ పరిధిలోకి ములుగు దవాఖాన



ములుగు, జూన్ 7(నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లో విలీనమైంది. ఇప్పటి వరకు ఇది వైద్యా విధాన పరిషత్ ఆధ్వర్యంలో ఉన్న విషయం తెలిసిందే. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన వైద్య సేవలందించాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ములుగు జిల్లాలోనూ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన స్థాయి రోజు రోజుకు పెరుగుతున్నది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందే అవకాశం లభించింది. 20 ఏళ్ల క్రితం ఒక వైద్యాధికారి, 30 పడకలతో కొనసాగిన ప్రభుత్వ దవాఖాన తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వ కృషితో 100 పడకల దవాఖానగా మారింది. 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ములుగు జిల్లాకు మెడికల్ కాలేజీని మంజూరు చేయడంతో ఇక్కడి దవాఖాన దానికి అనుబంధంగా రూపాంతరం చెందింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెడికల్ కాలేజీ ప్రారంభమై మొదటి బ్యాచ్‌లో 50 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా ఈసారి మరో 50 మంది ప్రవేశాలు పొందనున్నారు. దీంతో మెడికల్ కాలేజీ విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు ప్రభుత్వం ఈ దవాఖానను జనరల్ ఆస్పత్రిగా స్థాయిని పెంచి మెడికల్ ఎడ్యుకేషన్ విభాగానికి బదిలీ చేసింది. మూడు రోజులుగా ఉద్యోగులు, వైద్య సిబ్బంది బదలాయింపు ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన డాక్టర్ జగదీశ్వర్ డీసీహెచ్ సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు. జనరల్ దవాఖాన సూపరిండెంట్‌గా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బీ మోహన్‌లాల్ నియమితులయ్యారు.

**సిబ్బంది లేక ఇబ్బందులు**

మెడికల్ కాలేజీ అనుబంధ దవాఖానగా ములుగు ఆస్పత్రిని మార్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తగిన మేర వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో అరకొర సేవలందుతున్నట్లు తెలుస్తున్నది. గతంతో పోల్చితే ఓపీతో పాటు ఐపీ సేవలు రెండితలు పెరిగాయి. సగటున రోజుకు 650మంది ఓపీ వైద్య సేవలు పొందుతుండగా ఇన్‌పేషెంట్లుగా 150 మంది చేరుతున్నారు. మాతా శిశు సంబంధిత సేవలు, జనరల్ మెడిసిన్, సర్జరీ, ఈఎన్‌డీ, కంటి, ఆర్థో, ఇతర విభాగాలు కలుపుకొని మొత్తం 14 స్పెషలిస్టు సేవలు అందుతున్నాయి. ల్యాబుల్లో తగిన సిబ్బంది లేకపోవడంతో పరీక్షలు నిలిచిపోతున్నాయి. మెడికల్ కాలేజీలో 12 మంది ప్రొఫెసర్లు, 17 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 29 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లతో తరగతులు నిర్వహిస్తుండగా వీరంతా ములుగు దవాఖానలో వైద్య సేవలందించేందుకు తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీఆర్మ్ యంత్రం నెలకొల్పగా గత ప్రభుత్వ హయాంలో సిటీ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం టెక్నిషియన్‌లు, అర్హత గల వైద్యాధికారులు లేకపోవడంతో రిపోర్టులు అందించలేని పరిస్థితి నెలకొంది. అయితే ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది తిరిగి కాంట్రాక్టు ప్రాతిపదికన దవాఖానలో చేరి ఇష్టారీతిగా విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థులతో ఛాన్సలర్ వరదారెడ్డి, వైస్ ఛాన్సలర్, దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి

## ఎస్ఆర్‌యూలో ప్లేస్‌మెంట్స్ జోష్

- 1200మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు
- అత్యధిక వార్షిక ప్యాకేజీ రూ.51లక్షలు

హసన్‌పర్తి, జూన్ 7 : ఎస్ఆర్ యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ విజయాలను పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం గ్రాండ్ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అసోసియేట్ డైరెక్టర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ జీ.సునీల్ 2024-25 విద్యాసంవత్సరానికి గాను ప్లేస్‌మెంట్ నివేదికను సమర్పించారు. మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, సర్వీస్ నౌ, పే పాల్, ఫ్లిప్‌కార్ట్ నీవ్, ష్నైడర్ ఎలక్ట్రిక్, ఇన్ఫోసిస్, కాప్జెమిని, యాక్సెంచర్, కాగ్నిజెంట్, హ్యుందాయ్, బోష్, తోషిబా, టెక్ మహీంద్ర వంటి మల్టీ నేషనల్ కంపెనీల్లో 1200మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అత్యధిక వార్షిక ప్యాకేజీ రూ.51లక్షలు, రూ.44 లక్షలు, రూ.34.4 లక్షల ప్యాకేజీ సాధించారని ఛాన్సలర్ వరదారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లేస్‌మెంట్స్‌తో పాటు విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించేందుకు అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఆర్ ఐఎక్స్ ఇంక్యుబేషన్ కేంద్రం ద్వారా విద్యార్థుల స్టార్టప్ ఆలోచనలకు సీడ్ ఫండింగ్ ద్వారా మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనతో పాటు వైస్ ఛాన్సలర్ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి ప్లేస్‌మెంట్స్ పొందిన విద్యార్థులకు అభినందన పత్రాలు, ఆఫర్ లెటర్లను అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి సహకరించిన డీన్‌లు, ప్లేస్‌మెంట్ బృందం, అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో ప్రొ. వైస్ ఛాన్సలర్ మహేశ్ పాల్గొన్నారు.

## భూ కబ్జాకు కాంగ్రెస్ అధ్యక్షుడి యత్నం

- అధికార పార్టీ అంటూ బెదిరింపులు
- పట్టించుకోని పోలీసులు
- కొట్టారు...కేసు నమోదు చేశారు
- పాలకుర్తి ఎస్సైపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా..
- రాజీవ్ చౌరస్తాలో బాధితుడు, దివ్యాంగుడు రూపాని సాలయ్య ధర్నా



ధర్నా చేస్తున్న దివ్యాంగుడు రూపాని సాలయ్య, యాదమ్మ దంపతులు

పాలకుర్తి, జూన్ 7 : తాను కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని కబ్జా చేయడానికి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు యత్నిస్తున్నాడని పాలకుర్తి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు తన కుటుంబ సభ్యులతో కలిసి రాజీవ్ చౌరస్తాలో ధర్నాకు దిగాడు. సుమారు అర్ధగంటపాటు ఎండలో ధర్నా చేపట్టారు. వివరాల్లోకి వెళితే... మల్లంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతం వెంకన్నకు ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్య కుమారుడికి వెంకన్న భూమి రిజిస్ట్రేషన్ చేశాడు. పెద్ద భార్య ఆమె కుమారుడు 2009లో ఖమ్మం జిల్లాకు చెందిన కొనకంచి సురేశ్‌కు ఆ 5ఎకరాల 20గుంటల భూమిని విక్రయించారు. తిరిగి ఆ భూమిని మల్లంపల్లి గ్రామానికి వలస వచ్చిన వడ్డెర కులానికి చెందిన రూపాని యాదమ్మ, సాలయ్య దంపతులకు సురేశ్ విక్రయించాడు. కొన్నేళ్లు వ్యవసాయం చేసుకున్నారు. వృత్తిరీత్యా సాలయ్య, యాదమ్మ దంపతులు వలస పోగా ఆ భూమిని చింతం వెంకన్న కబ్జా చేశాడు. ఈ విషయంలో కొన్నేళ్లుగా ఇరువర్గాలకు మధ్య పంచాయతీ, కోర్టులో కేసులు నడుస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే స్థానిక నాయకుల అండదండలతో 2024లో చింతం వెంకన్న భూమిని సాగు చేయడానికి వెళ్లాడు. దీంతో రూపాని యాదమ్మ, సాలయ్య కుటుంబ సభ్యులకు చింతం వెంకన్నతో గొడవ జరిగింది. చింతం వెంకన్నతోపాటు కొడుకు, కుటుంబ సభ్యులు రూపాని యాదమ్మ, ఆమె కొడుకు, కుమార్తెలపై దాడి చేశారు. ఇరువర్గాలు గొడవకు దిగాయి. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. చింతం వెంకన్న కాంగ్రెస్ అధ్యక్షుడు కావడంతోనే పాలకుర్తి ఎస్సై తమపై అక్రమ కేసులు పెడుతున్నాడని రూపాని యాదమ్మ, దివ్యాంగుడు రూపాని సాలయ్య ఆరోపించారు. మమ్ముల్నే కొట్టి మా పైనే అక్రమ కేసులు పెడతారా.. అంటూ దివ్యాంగుడు రూపాని సాలయ్య, యాదమ్మ మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో పోలీసులకు వ్యతిరేకంగా ఎండలో ధర్నాకు దిగారు. పోలీసులు అధికార పార్టీ నాయకులకు అండగా ఉంటూ పేదలపై అక్రమ కేసులు పెడుతున్నారని దివ్యాంగుడు సాలయ్య ఆరోపించాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సాలయ్య, యాదమ్మ వాపోయారు. పాలకుర్తి ఎస్సైపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ విషయంపై దూలం పవన్‌కుమార్‌ను వివరణ కోరగా ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని చెప్పారు. భూ సమస్యలు ఉంటే సివిల్ కోర్టులో పరిష్కారించుకోవాలన్నారు.

## ఐస్‌ప్యాక్స్ లేక.. వ్యాక్సిన్లు తేలే!

- పిల్లలకు టీకాలు వేయక తిప్పిపంపిన ఆశ వర్కర్లు
- సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లులు
- తరచూ ఇలాగే జరుగుతుందని మండిపాటు
- పెద్దకోడెపాక పల్లె దవాఖానలో ఘటన
- విధులకు హాజరుకాని ఇన్‌చార్జి ఏఎన్‌ఎంలు

శాయంపేట, జూన్ 7 : పల్లె దవాఖానాలు అధ్వానంగా మారాయి. పిల్లలకు వ్యాక్సిన్‌లు కూడా వేయలేని దుస్థితికి చేరాయి. ఏఎన్ఎంలు లేకపోవడంతో ఆశ వర్కర్లు మందులిచ్చి పంపిస్తున్న పరిస్థితి నెలకొంది. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక పల్లె దవాఖానలో శనివారం వ్యాక్సిన్ వేయించుదామని పిల్లలతో వచ్చిన తల్లులకు నిరాశే ఎదురైంది. అక్కడున్న ఆశ వర్కర్లు శాయంపేట ఆరోగ్య కేంద్రం నుంచి వ్యాక్సిన్లు రాలేదని చెప్పి వారిని ఇంటికి పంపించినట్లు పలువురు తెలిపారు. శాయంపేట పీహెచ్‌సీతో పాటు పల్లె దవాఖనాలు, సబ్‌సెంటర్లలో ప్రతి బుధ, శనివారం పిల్లలకు రోగ నిరోధక టీకాలు వేయాల్సి ఉంది. అయితే పెద్దకోడెపాక పల్లె దవాఖానకు ఐదేళ్ల వ్యాక్సిన్ వేయించేందుకు కొందరు మహిళలు తమ పిల్లలతో వచ్చారు. అయితే ఇక్కడ విధుల్లో ఉండాల్సిన ఏఎన్ఎం అనారోగ్యంతో సెలవు పెట్టగా పెద్దకోడెపాకకు చెందిన ముగ్గురు, జోగంపల్లికి చెందిన ఆశ వర్కర్ దవాఖానలో ఉన్నారు. మైలారం, పత్తిపాక ఏఎన్ఎంలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చినా వారు విధులకు హాజరు కాలేదు. దీంతో పిల్లలకు వ్యాక్సిన్ల కోసం వచ్చిన తల్లులు అక్కడే చాలా సేపు వేచివున్నారు. శాయంపేట పీహెచ్‌సీలో ఐస్‌ప్యాక్‌లు లేకపోవడంతో వ్యాక్సిన్లు తేలేదని జోగంపల్లి ఆశ వర్కర్ చెప్పారు. అయితే వారంలో రెండు రోజులు కూడా సక్రమంగా వ్యాక్సిన్ వేయడం లేదని, గత బుధవారం కూడా వేయలేదని తల్లులు ఆరోపించారు. సమయానికి వేయాల్సిన వ్యాక్సిన్‌లు లేవని ఇంటికి పంపిస్తుండటంపై వారు మండిపడ్డారు. పల్లె దవాఖానాలకు సమయానికి వ్యాక్సిన్‌లు పంపని మండల వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఎన్ఎంలు లేకపోవడంతో ఆశ వర్కర్లు వైద్యం కోసం వచ్చిన వారికి నామమాత్రంగా మందులిచ్చి పంపిస్తున్నారని తెలిపారు. అయితే సెంటర్లను పర్యవేక్షించాల్సిన మండల వైద్యాధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా సకాలంలో వ్యాక్సిన్లు వేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





వ్యాక్సిన్ లేకపోవడంతో పల్లెదవాఖాన నుంచి వెనుదిరుగుతున్న మహిళ

## వడదెబ్బతో ఒకరి మృతి



అంతయ్య(ఫైల్)

జనగామ చౌరస్తా, జూన్ 7 : వడదెబ్బతో ఒకరు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బీరప్పగడ్డ ప్రాంతానికి చెందిన నేతి అంతయ్య (70) లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. రోజువారీ పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన అంతయ్య తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జనరల్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అంతయ్య మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అంతయ్యకు భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.